క్లుప్తంగా

ఉపాధి కూలీ కుటుంబానికి చెక్కు అందజేత



బాధితురాలికి చెక్కు అందిస్తున్న ఎంపీపీ సత్యనారాయణ

మాకవరపాలెం: విద్యుత్ షాక్‌తో మృతి చెందిన వేతనదారు కుటుంబానికి ఉపాధి పథకం నుంచి రూ.50 వేలు మంజూరైంది. బూరుగుపాలెం గ్రామానికి చెందిన కొమ్మనాపల్లి కన్న బాబు(50) గ్రామ సమీపంలో చెరువు పనులు చేస్తుండగా విద్యుత్ వైర్లు తగిలి మరణించాడు. ఈ నేపథ్యంలో మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ రుత్తల సత్యనారాయణ మృతుడు భార్య లక్ష్మికి చెక్కు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో సీతామహాలక్ష్మి, ఉపాధి ఏపీవో వరలక్ష్మి పాల్గొన్నారు.

నేడు జాలంపల్లిలో మెగా వైద్య శిబిరం

మాడుగుల రూరల్: జాలంపల్లిలో ఆదివారం మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు కె.జె.పురం భానోదయ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ వ్యవస్థాపక చైర్మన్ రాపేట రామకొండలరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖ దరి అనిల్ నీరుకొండ ఆస్పత్రి సహకారంతో నిర్వహించే ఈ శిబిరంలో అన్ని రకాల పరీక్షలు చేసి, మందుల అందజేస్తారన్నారు. అవసరమైన వారికి శస్త్రచికిత్సలు చేయిస్తారని తెలిపారు.

అర్హులందరికీ ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు



గిరిజనులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆదివాసీ గిరిజనులు శనివారం ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు గోవిందరావు మాట్లాడుతూ కొన్నేళ్లుగా సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలన్నారు. అనేక దఫాలుగా అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదన్నారు. జగనన్నకు చెబుదాంలో చేసిన ఫిర్యాదులకు అతీగతీ లేదన్నారు. ఆర్డీవో స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని ఆర్డీవో హెచ్.వి.జయరాం హామీ ఇచ్చారు. అర్హులైన వారికి ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటానన్నారు.

పోలీసుల సందేహాల నివృత్తి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి పఠాన్ షియాజ్ ఖాన్

నర్సీపట్నం: పోలీసుల సందేహాలను సీనియర్ సివిల్ జడ్జి పఠాన్ షియాజ్ ఖాన్ నివృత్తి చేశారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం కోర్టు ప్రాంగణంలో పోలీసు అధికారులకు, మహిళా పోలీసులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళలు పని చేసే ప్రదేశాల్లో లైంగిక వేధింపులకు గురైతే తీసుకోవాల్సిన చర్యలు గురించి ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి వివరించారు. ప్రివెన్షన్ ఆఫ్ సెక్సువల్ హెరాస్మెంట్ యాక్టుపై పోలీసు అధికారులకు ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. యాక్టు గురించి ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సమావేశంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

వైస్ ఎంపీపీ తండ్రి మృతికి సంతాపం

కె.కోటపాడు: పాచిలవానిపాలెంలో వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ తండ్రి అప్పలనాయుడు(94) మృతదేహానికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు శనివారం నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, జెడ్పీటీసీ ఈర్లె అనురాధ, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు, మాజీ సర్పంచ్ దాట్ల తాతరాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సూర్యనారాయణను పరామర్శించి ఓదార్చారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
✆ 7997958337, 7075709854, 7997958336
సాక్షి

తీర్థాల సందడి

జిల్లా స్థాయి ఎడ్ల పందెం విజేత నరసయ్యపేట



జంపెనలో ఎడ్ల పరుగు పందెం ప్రారంభిస్తున్న సర్పంచ్ గురువునాయుడు

మాడుగుల: జంపెనలో రాములవారి తీర్థం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా తప్పెడ గుళ్లు, తోడ పెద్దు ఉత్సవాలు నిర్వహించారు. జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పరుగు పోటీల్లో నరసయ్యపేటకు చెందిన ముమ్మిన శివతేజ ఎడ్ల బండి విజేతగా నిలిచింది. మొత్తం 16 జతలు పాల్గొనగా, లెక్కలవానిపాలేనికి చెందిన పైడితల్లమ్మ జత, దండి సురవరానికి చెందిన హర్షవర్ధన్ నాయుడు ఎడ్ల జత ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. మరో 6 జతలకు బహుమతులు అందజేశారు.



విజేత జట్టుకు బహుమతి అందజేస్తున్న సర్పంచ్ రమణబాబు

జిల్లా స్థాయి కబడ్డీ విజేత విశాఖ

మాడుగుల రూరల్: జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో విశాఖ నగరంలోని అల్లూరు జట్టు విజేతగా నిలిచింది. కె.జె.పురంలో సీతారాముల తీర్థం సందర్భంగా శుక్రవారం రాత్రి స్థానిక హైస్కూలు ప్రాంగణంలో ఈ పోటీలు నిర్వహించారు. 20 కబడ్డీ జట్లు పాల్గొన్నాయి. విజేత జట్టుకు రూ.10 వేలు, తర్వాత స్థానాల్లో నిలిచిన విశాఖ నగరంలోని వి.బి.ఎస్ కబడ్డీ జట్టుకు రూ.8 వేలు, చీడికాడ మండలం దిబ్బపాలెం జట్టుకు రూ.6 వేలు, బుచ్చెయ్యపేట మండలం రాజాం జట్టుకు రూ.2 వేల చొప్పున సర్పంచ్ జామి రమణబాబు అందజేశారు. అదేవిధంగా కె.జె.పురం పాలగెడ్డ వద్ద మరిడిమాంబ తీర్థం సందర్భంగా సాయంత్రం కబడ్డీ పోటీలు నిర్వహించారు.



కె.కోటపాడు: పూజలు చేస్తున్న ఎంపీపీ జగన్‌మోహన్, తదితరులు

ఏఎల్‌పురంలో..

గొలుగొండ: ఏఎల్‌పురం మేజర్ పంచాయతీలో తీర్థాలు ఘనంగా జరిగాయి. ఏజెన్సీకి ముఖద్వారం కావడంతో మండలం నుంచే కాకుండా కొయ్యూరు, చింతపల్లి ప్రాంతాల నుంచి జనం పెద్ద ఎత్తున తరలివచ్చారు. దాంతో ప్రధాన రోడ్డు కిక్కిరిసింది. భక్తులకు ఇబ్బందులు లేకుండా కృష్ణదేవిపేట పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

కె.కోటపాడులో మరిడిమాంబ తీర్థం

కె.కోటపాడు: గ్రామదేవత మరిడిమాంబ తీర్థాన్ని కె.కోటపాడులో శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రంగుల రాట్నాలు, తదితర వినోద ప్రదర్శనలు చిన్నారులను ఆకట్టుకున్నాయి. ఆలయంలో ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, శ్రీకాంత్ శ్రీను, బుజ్జి, లగుడు ప్రసాద్, ఆర్‌సీకే చైర్మన్ దోకల అప్పలనాయుడు తదితరులు పూజలు చేశారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

నర్సీపట్నం: నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పట్టణంలో నాలుగు కేంద్రాల్లో శనివారం నిర్వహించిన ఈ పరీక్షకు 800 మంది విద్యార్థులు హాజరయ్యారు. నిర్దేశించిన సమయానికి కంటే ముందుగానే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు చేరుకున్నారు. దీంతో పరీక్ష కేంద్రాల వద్ద హడావుడి నెలకొంది. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా హెచ్‌ఎంలు తగు జాగ్రత్తలు తీసుకున్నారు.

మాకవరపాలెం: నవోదయ ప్రవేశ పరీక్షకు 201 మంది విద్యార్థులు హాజరయ్యారు. శనివారం నిర్వహించిన ఈ పరీక్షకు మాకవరపాలెం ఉన్నత పాఠశాలలో 144 మందికి 111 మంది, తామరం కృపాకమల్ స్కూల్లో 127 మందికి 99 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ పరీక్ష కేంద్రాలను ఎంఈవో పి.ఎస్.ఎన్.మూర్తి పరిశీలించారు.

రావికమతం: స్థానిక హైస్కూల్‌లో నవోదయ ప్రవేశ పరీక్షకు 240 మందికిగాను 202 మంది విద్యార్థులు హాజరయ్యారు. 38 మంది గైర్హాజరయ్యారని హెచ్‌ఎం మల్లికార్జునరావు శనివారం తెలిపారు. విద్యార్థులకు తాగునీరు, ఫ్యాన్లు, తదితర సౌకర్యాలు కల్పించారు. ఎస్ఐ ఉమామహేశ్వరరావు బందోబస్తు పర్యవేక్షించారు.



దేవరాపల్లి పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

దేవరాపల్లి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నవోదయ ప్రవేశ పరీక్షకు 157 మందికి గాను 119 మంది విద్యార్థులు హాజరయ్యారు. 38 మంది గైర్హాజరైనట్లు పరీక్షా కేంద్రం అబ్జర్వర్, కొమ్మాది నవోదయ స్కూల్ ప్రిన్సిపాల్ కె. సంజయ్ తెలిపారు. ఈ పరీక్షా కేంద్రాన్ని ఎంఈవో బి.పడాల్ దాస్ పర్యవేక్షించారు.

గడ్డివాము దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

మాడుగుల: వీరనారాయణంలో శనివారం గడ్డివాము దగ్ధమైంది. గ్రామానికి చెందిన కొనగాళ్ల రాము తన పొలంలో ఇటీవల నూర్పిడి చేసిన గడ్డివాము పెట్టారు. ఈ నేపథ్యంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో స్థానిక ఫైర్ అధికారి రాజేశ్వరరావు తన సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు. రూ.20 వేల ఆస్తి నష్టం వాటిల్లినట్టు అంచనా వేశారు.

ఘనంగా డెయిరీ చైర్మన్ ఆనందకుమార్ జన్మదినం

చీడికాడ: విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనందకుమార్ జన్మదిన వేడుకలు శనివారం అప్పలరాజుపురంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక పాల సొసైటీ వద్ద డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డెయిరీ డైరెక్టరు శీరంరెడ్డి సూర్యనారాయణ స్థానిక లలితాదేవి వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఎంపీపీ కురచా జయమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు లాలం శారద జానకీరామ్, పార్టీ మండలాధ్యక్షులు గొల్లవిల్లి రాజుబాబు, సర్పంచ్ చుక్కా అప్పలనాయుడు, పాల సొసైటీ అధ్యక్షుడు చుక్కా రమణ, మండల సచివాలయాల కన్వీనర్ ఈర్లె చైతన్య, యూనిట్ మేనేజర్ గుల్లిపల్లి రాము పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనందకుమార్ జన్మదినం సందర్భంగా కె.జె.పురం జంక్షన్‌లో సంతోషిమాత ఆలయ ఉచిత అన్నదాన సత్రం వద్ద శనివారం అన్నసమారాధన నిర్వహించారు. చోడవరం మండలం అంబేరుపురానికి చెందిన దాడి సంతోష్, శిరీష దంపతులు ఆర్థిక సహకారంతో 200 మందికి అన్నదానం ఏర్పాటు చేశారు. సంతోషిమాత ఆలయ కమిటీ చైర్మన్ కాళ్ల అమ్మతల్లినాయుడు పాల్గొన్నారు.



అప్పలరాజుపురంలో జన్మదిన కేక్ కట్ చేస్తున్న డిప్యూటీ సీఎం బూడి

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



గురువును సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

గొలుగొండ: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పార్కులో శనివారం పూర్వ విద్యార్థులు సందడి చేశారు. ఏఎల్‌పురం జెడ్పీ హైస్కూల్లో 1973 – 76 వరకు చదివిన 10వ తరగతి విద్యార్థులు 48 సంవత్సరాల తర్వాత కలుసుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి బాల్య జ్ఞాపకాలు, ప్రస్తుత యోగక్షేమాలు నెమరువేసుకున్నారు. అప్పటి గురువులకు ఘన సన్మానం చేశారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు పోతల శ్రీరామమూర్తి, ఎల్‌వీ రమణ, ఒబ్బలరెడ్డి శ్రీనువాసరావు, రేవుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రెండు ద్విచక్ర వాహనాల వేలం

మాడుగుల: వివిధ కేసుల్లో పట్టుబడిన రెండు ద్విచక్ర వాహనాలకు ఎస్ఈబీ సీఐ సింహాద్రి ఆధ్వర్యంలో శనివారం వేలం పాట నిర్వహించారు. హోండా బైక్ రూ.6 వేలకు ఖరారు కాగా, జీఎస్టీ రూ.1,080తో కలిపి రూ.7,080 పాటదారు చెల్లించారు. హోండా స్ప్లెండర్ ప్రో రూ.6,500 వేలం ఖరారు కాగా, జీఎస్టీ రూ.1,170 కలిపి రూ.7,670 చెల్లించారు. సొమ్మును ప్రభుత్వ ఖజానాకు జమ చేశామని సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఈబీ సిబ్బంది పాల్గొన్నారు.



బైక్‌లకు వేలం వేస్తున్న ఎస్ఈబీ సీఐ సింహాద్రి

విద్యార్థులు ఆటలపై మక్కువ చూపాలి

- విప్ కరణం ధర్మశ్రీ
- ఆడుదాం – ఆంధ్రా మండల స్థాయి విజేతలకు కిట్ల పంపిణీ



బుచ్చెయ్యపేటలో క్రీడాకారులకు కిట్లు అందిస్తున్న విప్ ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట: గ్రామీణ క్రీడాకారులు చదువుతోపాటు ఆటలపై శ్రద్ధ చూపి విజేతలుగా నిలవాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. శనివారం బుచ్చెయ్యపేటలో మండల స్థాయి ఆడుదాం – ఆంధ్రా ఆటల పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు క్రీడా కిట్లను ఆయన పంపిణీ చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణ క్రీడాకారులను జాతీయ స్థాయిలో తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతో ఆడుదాం – ఆంధ్రా ఆటల పోటీలను ఏర్పాటు చేశారన్నారు. గ్రామ స్థాయి నుంచి ఎదిగిన క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకుని రాణించాలన్నారు. మండల స్థాయి క్రికెట్ పోటీల్లో విజేతగా నిలిచిన రాజాం(పురుషులు), వడ్డాది-1 (మహిళలు), బాల్ బ్యాడ్మింటన్‌లో వడ్డాది-2, (పురుషులు), గున్నెంపూడి (మహిళలు), వాలీబాల్‌లో బుచ్చెయ్యపేట (పురుషులు), విజయరామరాజుపేట (స్త్రీలు), ఖోఖోలో తురకలపూడి (పురుషులు), తైపురం (మహిళలు), కబడ్డీలో రాజాం (పురుషులు), కేపీ అగ్రహారం (మహిళలు) జట్లకు కిట్లు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ దొండా రాంబాబు, పార్టీ మండలాధ్యక్షుడు జోగా కొండబాబు, సర్పంచ్‌లు తమరాన శ్రీను, పెదిరెడ్ల మాణిక్యం పాల్గొన్నారు.



నాతవరం: ఖోఖోలో విజేతగా నిలిచిన బాలికల జట్టును అభినందిస్తున్న దృశ్యం

నాతవరం: ఆడుదాం- ఆంధ్రా ఆటల పోటీలతో క్రీడాకారుల నైపుణ్యం బయటపడిందని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, జెడ్పీటీసీ కాపారపు అప్పలనర్స అన్నారు. శనివారం నాతవరంలో మండల స్థాయి క్రీడా పోటీలు ముగిశాయి. నియోజకవర్గ స్థాయికి ఎంపికైన కబడ్డీ, ఖోఖో, క్రికెట్, వాలీబాల్ క్రీడాకారులను అభినందించారు. త్వరలో నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొని మండలానికి ప్రత్యేక పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీవో హనుమంతరావు, సర్పంచ్ గొలగాని రాణి, ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, ఎంఈవో-2 కామిరెడ్డి వరహాలబాబు, ఈవోపీఆర్డీ ఎస్ఎస్ఎన్ మూర్తి, పంచాయతీ కార్యదర్శులు శ్రీను, హైస్కూల్ మాజీ కమిటీ చైర్మన్ వరహాలబాబు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నాతవరం: క్రికెట్‌లో విజేతగా నిలిచిన బాలురు జట్టును అభినందిస్తున్న దృశ్యం



రోలుగుంట: క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

రోలుగుంట: ఆడుదాం – ఆంధ్రా పోటీల్లో భాగంగా శనివారం క్రికెట్ పోటీలు నిర్వహించారు. బుచ్చింపేట, ఎం.కె.పట్నం, రత్నంపేట, శరభవరం, జానకిరాంపురం తదితర గ్రామాల నుంచి 11 జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీలను పీడీ డి.కొండబాబు పర్యవేక్షించారు. సోమవారం సెమీ ఫైనల్, ఫైనల్ పోటీలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

ఎంపీపీ కుటుంబానికి అండగా ఉంటాం

ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట: ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. ఇటీవల ఆమె భర్త నాగరాజు ఆకస్మికంగా మృతి చెందగా శనివారం సీతయ్యపేటలో సంతాప సభ జరిగింది. ఈ సందర్భంగా నాగరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాగరాజు మృతి పార్టీకి తీరని లోటన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఎంపీపీ త్వరగా కోలుకోవాలన్నారు. జెడ్పీటీసీ దొండా రాంబాబు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, పార్టీ మండలాధ్యక్షుడు జోగా కొండబాబు, రాష్ట్ర కిసాన్ సెల్ కార్యదర్శి కే అచ్చింనాయుడు, నాయకులు పాల్గొన్నారు.



నాగరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విప్ ధర్మశ్రీ

రూ.3 వేల పింఛన్‌తో హాయిగా బతుకుతున్నాం

- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు వద్ద వృద్ధుల ఆనందం
- చుక్కపల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం



నూతన వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న బూడి

చీడికాడ: మా పెద్దకొడుకు జగన్‌బాబు ఇచ్చిన రూ.3 వేల పింఛన్‌తో వృద్ధాప్యంలో హాయిగా కాలం వెళ్లదీస్తున్నామని డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు వద్ద వృద్ధులు ఆనందం వ్యక్తం చేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం అప్పలరాజుపురంలో ఆయన ఇంటింటికీ వెళ్లగా పై విధంగా పలువురు తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. ముందుగా గ్రామ సచివాలయం వద్ద నూతన వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గత టీడీపీ హయాంలో అసంపూర్తిగా నిర్మించిన ఇళ్లను బూడికి చూపించారు. దీనికి ఆయన స్పందించి మాట్లాడుతూ ఎన్నికల ముందు ఓట్ల కోసం తప్పుడు హామీలతో టీడీపీ అధినేత చంద్రబాబు మోసగిస్తే జగనన్న ఇచ్చిన మాటకు కట్టుబడి సంక్షేమ పథకాల అమలు చేస్తున్నారన్నారు. ఈ క్రమంలో ఒకే కుటుంబంలో ఎక్కువ సంక్షేమ పథకాలు పొందిన మహిళలను ఆరా తీయగా, ప్రభుత్వం ఇచ్చిన డబ్బుతో నల్లపూసలు, చెవి కమ్ములు, గేదెలను కొనుక్కున్నామని, పాన్ షాపు పెట్టుకుని కూరగాయలు అమ్ముకుంటున్నామని, అప్పులను తీర్చామని, పిల్లలను బాగా చదివిస్తున్నామని తమ సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు జీజేఎంపీ నుంచి గ్రామ సచివాలయానికి రూ.20 లక్షలు కేటాయించారు. విద్యుత్ స్తంభాలను మార్చాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రూ.1.73 కోట్లతో 90 వేల లీటర్ల వాటర్ ట్యాంకు నిర్మాణం పూర్తయిందని, 40 కె.ఎల్.వాటర్ సంపు నిర్మాణం, 670 ఇళ్లకు కుళాయిల ఏర్పాటు చేస్తున్నామన్నారు. సీసీరోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారీ చేయాలని ఆదేశించారు. ఎస్సీ కాలనీలో రూ.15 లక్షలతో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్‌కు మరో రూ.5 లక్షల కేటాయించారు. రూ.1.78 కోట్లతో వివిధ సంక్షేమ పథకాల ద్వారా నగదు బదిలీ అయినట్టు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ చుక్కా అప్పలనాయుడు, ఎంపీపీ కురచా జయమ్మనారాయణమూర్తి, జెడ్పీటీసీ లాలం శారదాజానకీరాం, పార్టీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, యూత్ అధ్యక్షుడు స్వామినాయుడు, సీనియర్ నేతలు సుంకర శ్రీనివాసరావు, మోసూరి సన్నిబాబు, నందారపు రమణబాబు, నెంబర్ సత్యం పాల్గొన్నారు.



వృద్ధురాలి సమస్యలు వింటున్న బూడి

ప్రజల్లోకి ప్రభుత్వాభివృద్ధి, సంక్షేమం

పార్టీ కార్యకర్తల సమావేశంలో విప్ కరణం ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట/రోలుగుంట: గ్రామాల అభివృద్ధితోపాటు పేదల సంక్షేమం కోసం పథకాలందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. శనివారం బుచ్చెయ్యపేట మండలం దిబ్బిడి, రోలుగుంటలో పార్టీ శ్రేణుల మండల స్థాయి విస్తృత సమావేశాలు వేర్వేరుగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో చేపట్టిన అవినీతి పాలనను, ప్రస్తుతం నీతిమంతమైన పరిపాలన విధానాన్ని ప్రజలకు అర్థమయ్యేలా చైతన్యం తీసుకురావాలన్నారు. రాష్ట్ర ప్రజలు బాగుండాలంటే ముఖ్యమంత్రిగా జగనన్నను రెండో సారి గెలిపించేలా కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు. ఈ నెల 27న భీమునిపట్నంలో సీఎం బహిరంగ సభకు పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, పార్టీ మండలాధ్యక్షుడు జోగా కొండబాబు, జెడ్పీటీసీ దొండా రాంబాబు, వైస్ ఎంపీపీలు దొండా లలితా నారాయణమూర్తి, గొంపా చినబాబు, కొల్లు సన్యాసినాయుడు, వలంటీర్ల మండల కన్వీనర్ మద్దు అప్పలనాయుడు, కొప్పుల వెలమ స్టేట్ డైరెక్టర్ టి.వి.రమణ, పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు దోసపత్ని రాజు, నాయకులు పోతల లక్ష్మీశ్రీనివాస్, బంటు సూర్య సన్యాసి దేముళ్లు, మలసాల భాస్కరరావు, సర్పంచ్ పెదిరెడ్ల మాణిక్యం పాల్గొన్నారు.



రోలుగుంటలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

వైభవంగా గౌరీపరమేశ్వరుల ఉత్సవం

నాతవరం: ములగపూడిలో గౌరీపరమేశ్వరుల ఉత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో సంప్రదాయ ప్రకారం నెల రోజుల పాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. చివరి రోజు ఉదయం నుంచి పురవీధుల్లో భజనలు, కోలాటం, డప్పువాయిద్యాలు, కాళీమాత నృత్యాల నడుమ అమ్మవారిని ఊరేగించారు. భక్తులు అమ్మవారికి సారె సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ సర్పంచ్ పి.నూకరాజు, వైఎస్సార్‌సీపీ బూత్ కమిటీ కన్వీనర్ ఇతంశెట్టి గోవిందరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు టి.రామునాయుడు, కార్యకర్తలు ఎల్.సత్తిబాబు, బి.జగన్, ఎస్.సత్తిబాబు పాల్గొన్నారు.



అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు

విద్యుత్ ఉపకేంద్రం ప్రారంభోత్సవం నేడు



నూతన విద్యుత్ సబ్ స్టేషన్

రూ.3.5 కోట్లతో తారువలో నిర్మాణం

దేవరాపల్లి: తారువలో నూతనంగా నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రాన్ని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఆదివారం ప్రారంభించనున్నారు. ఈ మేరకు తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ విశాఖపట్నం సర్కిల్ ఆపరేషన్స్ ఎస్ఈ ఎల్.మహేంద్రనాథ్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. రూ. 3.5 కోట్లతో ఇక్కడ నిర్మించిన నూతన విద్యుత్ సబ్‌స్టేషన్‌తో దేవరాపల్లి మండలానికి కరెంట్ కష్టాలు తీరనున్నాయి. విద్యుత్ శాఖ అధికారులు ఇటీవల టెక్నికల్ చార్జింగ్ టెస్ట్ సైతం నిర్వహించి ప్రారంభోత్సవానికి సిద్ధం చేశారు. మండలంలో దేవరాపల్లి, బోయిలకింతాడ విద్యుత్ సబ్ స్టేషన్లు ఉన్నాయి. వీటి పరిధిలో 20 వేల ఇళ్ల కనెక్షన్లు, 1,800 వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. ఈ రెండింటికి మధ్య తారువలో సబ్ స్టేషన్ ఏర్పాటుతో వీటిపై లోడ్ తగ్గనుంది. దీని నుంచి తారువతోపాటు తిమిరాం, వాకపల్లి సహా చీడికాడ మండలం నీలంపేట, కొత్తూరు, చీడిపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా చేసేందుకు సర్దుబాటు చేస్తున్నారు. దీంతో తారువకు 24 గంటలు త్రీఫేజ్ కరెంట్ సరఫరా అందుబాటులోకి రానుంది. సీఎం జగన్‌కు, డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు, విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ఆయా గ్రామాల ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

139 మందికి వైద్య పరీక్షలు

కె.కోటపాడు: ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమంలో భాగంగా శనివారం దాలివలసలో చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి సుబ్రహ్మణ్యం 139 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు ఇచ్చారు. వీటితో పాటు గర్భిణులకు ఆరోగ్య తనిఖీలు, బీపీ, సుగర్ పరీక్షలు చేశారు. ఏఎన్ఎం నాగమణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నర్సీపట్నం డివిజన్:
నర్సీపట్నం : 9010234557
చోడవరం : 9010210265
మాడుగుల : 9010546644
Office mail : sakshiadvtvsp@gmail.com